బీఆర్ఎస్‌కు ఎంబీసీ చైర్మన్ 'వజ్రోజు' గుడ్‌బై

తీగల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎంబీసీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రవీంద్రాచారి తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎంబీసీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు వజ్రోజు రవీంద్రాచారి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. గతంలో తీగల కృష్ణారెడ్డితోపాటు బీఆర్ఎస్‌లో చేరి, అనంతరం ఎంబీసీ చైర్మన్ పదవి పొందిన వజ్రోజు.. ఇటీవల తీగల కాంగ్రెస్‌లో చేరడంతో ఆయనతో పాటు నడవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఎంబీసీ చైర్మన్ పదవికి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, మంగళవారం తీగల సమక్షంలో హస్తం గూటికి చేరుకున్నారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకుడు నరసింహ, ఇతరనేతలు సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోని నియంతృత్వం కాంగ్రెస్‌లో కనిపించడంలేదన్నారు. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం దక్కుతోందని చెప్పారు. వజ్రోజు మాట్లాడుతూ పేరుకు ఎంబీసీ చైర్మన్ పదవి ఉన్నప్పటికీ దానికి నిధులుగానీ, విధులుగానీ లేకపోవడంతో ఉత్సవ విగ్రహంగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు రవినాయక్, నాయకులు గడికోట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బేర బాలకిషన్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తమ పదవికి రాజీనామా చేసిన బేర బాలకిషన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి బాలకిషన్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల పరిధిలోని అనేక సమస్యలపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిర్లక్ష్యం చేయడం వల్లే కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సహకారంతో సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



బేర బాలకిషన్‌కు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి

'సోలార్ విద్యుత్'ను సద్వినియోగం చేసుకోండి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ గౌడ్ సూచించారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో మంగళవారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంపై సెమినార్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ యూనిట్ల కాంట్రాక్టర్లతో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని, పీఎం సూర్య ఘర్ ఉచిత పథకంతో దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిబాబు, ఉపాధ్యక్షుడు రాజేష్ పరకాల, సంయుక్త కార్యదర్శులు బాబు నాయుడు, శ్రీనివాస్, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ ప్యానల్స్ ఇంటిగ్రేటర్స్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు,

3 కిలోవాట్లకు రూ. 78 వేల రాయితీ...

పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంలో 1 కిలో వాట్‌కు రూ. 30 వేలు, 2 కిలో వాట్స్ వరకు రూ. 60 వేలు, 3 కిలో వాట్ నుంచి 10 కిలోవాట్ వరకు రూ. 78 వేల రాయితీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇదే తరహాలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసుకునే వారికి రాయితీ అందిస్తే రాష్ట్రవ్యాప్తంగా సోలార్ విద్యుత్‌ఉత్పత్తి చేసేవారి సంఖ్య లక్షల్లోకి చేరుకుంటుందని, దీంతో పీక్ అవర్‌లో ఇతర రాష్ట్రాలనుంచి అధిక ధరకు విద్యుత్ కొనాల్సిన అవసరం తగ్గిపోతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు పెద్దఎత్తున అందుబాటులోకి తీసుకురావాలని, భవిష్యత్‌లో డిస్కంలు ఇచ్చే విద్యుత్‌మీటర్ల స్థానంలో స్మార్ట్ నెట్‌మీటర్లు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రానున్న రోజుల్లో ఫార్మా నెంబర్ 1గా భారత్

క్వీన్స్‌లాండ్ ఇన్‌వెస్ట్‌మెంట్ సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్, ఫార్మా రంగాల్లో ఆవిష్కరణలకు, పరిశోధనలకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ పెట్టింది పేరని, ఆస్ట్రేలియా ఫార్మా ఎగుమతుల్లో 70 శాతం ఇక్కడి నుంచే ఉంటాయని క్వీన్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సౌత్ ఏషియా కమిషనర్ అభినవ్ భాటియా తెలిపారు. బయో ఏషియా సదస్సులో భాగంగా నోవాటెల్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సదస్సులో నిపుణులతో కలిసి మాట్లాడారు. హెల్త్‌కేర్ రంగంలో ఆస్ట్రేలియా ఆవిష్కరణలు, భారత్‌లోని నిపుణులైన మానవనరులు ఒకతాటిపై చేర్చేందుకు తాము ముందుకు వచ్చామన్నారు. రానున్న దశాబ్దాల్లో ఫార్మా రంగంలో ప్రపంచంలోనే మొదటి స్థానానికి భారత్ చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయో ఇంజనీరింగ్ అండ్ నానోటెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అలెన్ రోవన్ మాట్లాడుతూ కేరళలో బర్డ్‌ఫ్లూ వ్యాపించిన సమయంలో తమ వర్సిటీ పరిశోధనల ద్వారా రూపొందించిన వ్యాక్సిన్‌ను అందించి సహకరించామని గుర్తుచేశారు. భారత్‌లో ఫార్మారంగ విస్తరణకు అనుకూల వాతావరణం ఉందని, దీనికి క్వీన్‌లాండ్ తమ టెక్నాలజీని అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్వీన్‌లాండ్ డీన్ ప్రొఫెసర్ ప్రసాద్ యార్లగడ్డ మాట్లాడుతూ టెక్నాలజీ మార్పిడి కోసం ఇండియాలోని యూనివర్సిటీలు, ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. ఇతర దేశాలతో పోల్చితే తక్కువ ఖర్చుతో, ప్రపంచం విశ్వసించే డాటాను అందిస్తామని క్లినియల్స్ ఫౌండర్ సీఈఓ మారి బేరి తెలిపారు. సదస్సులో సదరన్ ఆర్ఎన్ఏ బిజినెస్ హెడ్ క్రిస్‌వాజ్, ఏషియా సంస్థ సీఈఓ డాక్టర్ రంజీత్ ఎస్ ఆజ్మానీ, క్విఐఎంఆర్ బెర్‌హోగర్ డైరెక్టర్ హెడ్ తమన్నా మోనెమ్ మాట్లాడారు.

సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

● రాచకొండ సీపీ తరుణ్ జోషి



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మార్చి 1 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. ఫిబ్రవరి 17న ప్రారంభమైన పదో ఎడిషన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2024 పోటీలో భాగంగా మార్చి 1 నుంచి 3 వరకు టి-20 మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వివిధ భాషల సినీతారలు పాల్గొనే క్రికెట్ మ్యాచ్‌లకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. టికెట్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని, సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కూల్ డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాల ధరలు నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతను పర్యవేక్షించాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్ల విషయంలో గందరగోళం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, డీసీపీ(ఎస్‌బీ)కరుణాకర్, డీసీపీ(క్రైమ్స్) అరవింద్‌బాబు, ఎస్‌బీ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ పురుషోత్తంరెడ్డి, కుషాయిగూడ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఏసీపీ నరేందర్‌గౌడ్, సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఫౌండర్ విష్ణువర్ధన్ ఇందూరి, అధికారులు పాల్గొన్నారు.

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం

చైర్మన్‌పై బలపరీక్ష నేడు



బాటసింగారం రైతుసేవా సహకార సంఘం లిమిటెడ్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై సంఘం డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై బలపరీక్ష కోసం బుధవారం అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి అధ్యక్షతన అవిశ్వాస తీర్మానంపై బలనిరూప పరీక్ష నిర్వహించనున్నారు. సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. అందులో ఒక డైరెక్టర్ అనారోగ్య కారణాలతో ఇటీవలే మృతి చెందాడు. ఈనెల 8న సంఘంలోని 9మంది డైరెక్టర్లు చైర్మన్ విఠల్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన పత్రాన్ని డీసీవోకు అందజేసి క్యాంపునకు తరలివెళ్లిన సంగతి తెలిసిందే. అయితే చైర్మన్‌పై ప్రకటించిన అవిశ్వాసంపై బలనిరూపన కోసం బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి...జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు డైరెక్టర్లకు నోటీసులకు అందజేశారు. ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభమవుతుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

క్యాంపులో మెజార్టీ డైరెక్టర్లు...

సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డిపై మెజార్టీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 13 మందిలో ఒక డైరెక్టర్ మృతి చెందగా ప్రస్తుతం 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. అయితే చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గేందుకు 2/3 వంతు అంటే 9 మంది సభ్యులు బలం అవసరం ఉంటుంది. ప్రస్తుతం క్యాంపులో 9 మంది డైరెక్టర్లు (సంఘం వైస్‌చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, చేగూరి భరత్, చింతల లక్ష్మమ్మ, మొగుళ్ల చిన్న యాదిరెడ్డి, బిజిలి బాల నర్సింహ, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు) ఉన్నారు. వీరంత బుధవారం నేరుగా ప్రత్యేక సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ మినహా ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే ఇక్కడ ఉన్నారు. దీన్ని బట్టి చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎన్ఎస్ఎస్ యశోద నర్సింగ్ కళాశాల యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, మధుమేహం, రక్తపరీక్షలు, ఈసీజీ, టూడీ ఎకో, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రంగ సంతోష్‌కుమార్, డాక్టర్ రఘు, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ సంతోషి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డీవీ మీణాకుమారి, సోఫియా, రేణుక, శ్రీధర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, విజయ్‌కుమార్, సాయిరెడ్డి, శాంతిప్రసాద్, వెంకట్రావు, శ్రీనివాస్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, సందీప్, సుధాకర్‌చారి, నగేష్, మధుసూదన్‌రెడ్డి, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

లింగోజిగూడలోని పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవేర్ గ్లోబల్ గ్లెనిగల్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొమరయ్య నేతృత్వంలో పల్లవి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుల ప్రదానం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, అంకితభావంతో విధి నిర్వహించిన 12 మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రదానం చేశారు. సికింద్రాబాద్ రైల్‌నిలయంలో మంగళవారం జరిగిన భద్రత సమీక్ష సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డీఆర్‌ఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్, విజయవాడ, నాందేడ్ డివిజన్‌లలో ఒక్కో డివిజన్‌లో ముగ్గురి చొప్పున, హైదరాబాద్ డివిజన్‌లో ఒకరికి, గుంతకల్ డివిజన్‌లో ఇద్దరికి మ్యాన్ ఆఫ్ ది మంత్ భద్రతా అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ భద్రతా విధానాలను అనుసరించడంలో, ఉద్యోగులను ప్రోత్సహించడానికి అవార్డులు దోహదపడతాయని అన్నారు.

మహిళా దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

వనస్థలిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల 4న నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మంగళవారం నాగోల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉత్సవాలకు రాష్ట్ర మంత్రి సీతక్క, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి నియామకపత్రాలను శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలిగా జాహ్నవి, హైదరాబాద్ అధ్యక్షురాలిగా చంద్రకళ, కార్యదర్శిగా జ్యోతి, వనస్థలిపురం అధ్యక్షురాలిగా సవిత, కార్యదర్శిగా భవాని, ఆర్‌కేపురం అధ్యక్షురాలిగా కె.అరుణ, కార్యదర్శిగా కె.గీత నియమితులయ్యారు. కార్యక్రమంలో పబ్బ చంద్రశేఖర్, మంజుల, ఉప్పల స్వప్న, నరేష్‌గుప్తా, చింతల రజినీకాంత్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లోని వీరన్నగుట్టను సందర్శించిన కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

శివరాత్రికి భారీఏర్పాట్లు చేయాలి

- కార్పొరేటర్ నరసింహారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని వీరన్నగుట్టకు ఈ సంవత్సరం భారీసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందుకు జీహెచ్ఎంసీ అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కోరారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రాచీనమైన ఈ ఆలయానికి చెందిన ప్రభుత్వ భూమి రోజు రోజుకూ కబ్జాకు గురతోందన్నారు. ఇప్పటికే అనేక మంది ఆక్రమించి ప్రభుత్వం కల్పించిన జీవోల కింద రెగ్యులరైజ్ చేయించుకున్నారని తెలిపారు. ఆక్రమణలను వెలికితీసి సదరు భూములను తిరిగి దేవాలయానికి అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సమీపం కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కలుషితాన్ని నివారించండి

- కార్పొరేటర్ పవన్‌కుమార్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సత్యానగర్‌లో పాత డ్రైనేజీ పైప్‌లైన్లు పాడైపోవడంతో తలెత్తిన తాగునీటి కలుషిత సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. సత్యానగర్‌లో కమ్యూనిటీ హాల్ సమీపంలో రోడ్ నెం.7లో డ్రైనేజీ పైప్‌లైన్ పాడై, మురుగు నీరు పక్కనే ఉన్న 5 ఇళ్లలోని తాగునీటి సంపుల్లోకి చేరుతోంది. కొన్నాళ్ల క్రితం డ్రైనేజీ పైప్‌లైను, మ్యాన్‌హోల్ మరమ్మతులు చేపట్టారు. మంగళవారం పవన్‌కుమార్ కాలనీని సందర్శించారు, జలమండలి అధికారులతో మాట్లాడారు. తాగునీటి సరఫరా నిలిచిన ఇళ్లకు ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిచాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో పలు చోట్ల సామర్థ్యం తక్కువగా ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్లు ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సమస్య తరచూ తలెత్తుతోందని, శాశ్వత పరిష్కారానికి కొత్త పైప్‌లైన్ వేయాలని కాలనీ కార్యదర్శి రమణ విన్నవించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ కరుణాకర్‌బాబు

వేసవిలో విద్యుత్ అంతరాయం ఉండొద్దు : ఎస్ఈ

ఎల్బీనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ కరుణాకర్‌బాబు ఆదేశించారు. వేసవి ప్రత్యేక కార్యాచరణప్రణాళిక, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే క్రమంలో సరూర్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడంలో అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా తమతమ ఎఓసీ పరిధిలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలన్నారు. ఈ వేసవిలో విద్యుత్ వినియోగం 30 శాతం పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. వేసవిలో ఎంత డిమాండ్ పెరిగినా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సరూర్‌నగర్ డీఈ రామకృష్ణ, ఏడీఈ తిరుపతయ్య, ఏఈలు అనూషరాణి, జాన్సన్, రోహిత్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

'కాలుష్యం వెదజల్లుతున్న 'రెడీమిక్స్'పై చర్యలు తీసుకోండి'

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాలుష్యం వెదజల్లుతున్న రెడీమిక్స్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పెద్దఅంబర్‌పేట్ పురపాలక సంఘం 19వ వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీ సమీపంలోని తిరుమల రెడీమిక్స్ ప్లాంట్ ద్వారా ప్రతి రోజూ దుమ్ముధూళితో పాటు వాయు కాలుష్యం వస్తోందన్నారు. రెడీమిక్స్ ప్లాంట్ పక్కనే టీఎస్ఆర్ బ్రిక్స్ తయారీ కంపెనీ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. రెండు కంపెనీల ద్వారా విపరీతమైన వాయు, శబ్ద కాలుష్యం వస్తోందని కాలనీకి చెందిన బొడ్డుపల్లి కృష్ణ తెలిపారు. వాటి ద్వారా వెలుబడుతున్న దుమ్ము కాలనీలోని ఇళ్లను కమ్మేస్తోందన్నారు. కనీస నిబంధనలు పాటించకుండా నడిపిస్తున్న రెండు కంపెనీలపై కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ బడికి 'విహార' సౌండ్స్ సిస్టం అందజేత



మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం వెంకటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు విహార ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కందాళ బల్‌దేవ్‌రెడ్డి సౌండ్ సిస్టంను మంగళవారం అందజేశారు. 2012-13 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్‌ఎం వెంకటయ్య, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బల్‌దేవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు వేణు, శివ, శేఖర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ విజయ సంకల్ప యాత్ర

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ జిల్లాలోకి బీజేపీ విజయ సంకల్ప యాత్ర బుధవారం ప్రవేశించనున్న సందర్భంగా 2వేల బైక్‌లతో యాత్ర ముందుకు సాగేలా భారీ ఏర్పాట్లు చేశామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మూడు చోట్ల బహిరంగ సభలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు పార్టీ కేంద్ర నాయకులు జిల్లాలోని పాతబస్తీలోని ఛత్రినాక, ఐఎస్‌సదన్, ముసారాంబాగ్‌లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు..16 కేంద్రాలు..

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇంటర్ పరీక్ష రాయనున్న విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో ముందు చూసుకుని పరీక్ష సమయం ప్రారంభానికి ముందే చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవడంతో నిమగ్నమయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

శాతవాహన నగర్ కాలనీ కమిటీ ఏకగ్రీవం



శాతవాహన నగర్ కాలనీ అధ్యక్షుడు నందిరాజు లక్ష్మీనారాయణ

వనస్థలిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహననగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవమైంది. నూతన అధ్యక్షుడిగా నందిరాజు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చెరుకు వెంకటేష్, కార్యదర్శిగా ఎస్.నాగేశ్వర్ రావు, కోశాధికారిగా వి.చిరంజీవులు, ఉపాధ్యక్షులుగా టీడి శర్మ, పీకేవీ.శాస్త్రి, సంయుక్త కార్యదర్శులుగా భరత్, రసూల్ సాహెబ్, పోచిరాజు సుబ్రమణ్యం, కార్యవర్గసభ్యులుగా గురునాథరావు, మురళీ కృష్ణ, జ్ఞానసుందర్, వాణిరెడ్డి, శోభారాణి, కృష్ణమోహన్, సుబ్బారావు, పవన్, ప్రకాశ్ రావు, రామకిషన్ రావు తదితరులు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఏసీపీకి సన్మానం



వనస్థలిపురం ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన పి.కాశీరెడ్డిని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్, మకుటం సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

ఖరీదైన వాహనాలే టార్గెట్

● ఆంధ్రా నుంచి వచ్చి తెలంగాణలో చోరీలు.. ● అరెస్ట్ చేసిన పోలీసులు
● 4 బుల్లెట్‌బైక్‌లు , హీరో బైక్ స్వాధీనం

ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో ఖరీదైన వాహనాలను దొంగిలిస్తున్న ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈస్ట్ జోన్ డీసీపీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు.



నిందితులు, వారు దొంగిలించిన వాహనాలతో పోలీసులు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన జి.రామాంజనేయులు(21), గోగుల గోపాల కృష్ణ(20), షేక్ కసినపల్లి బాషా(24)లు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను దొంగిలించేవారు. గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్ గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను, నవంబర్‌లో అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో మరోబైక్‌ను దొంగిలించి గుంటూరుకు తరలించారు. ఈనెలలో సూర్యాపేట టూ టౌన్ పీఎస్ పరిధిలో రెండు బైక్‌లను, హైదరాబాద్ సుల్తాన్‌బజార్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్(ఎంజీబీఎస్) పార్కింగ్‌లో పార్క్ చేశారు. మూడు రోజుల క్రితం గుంటూరు నుంచి మిగతా రెండు బైక్‌లను విక్రయించేందుకు నగరానికి తీసుకుచ్చి ఎంజీబీఎస్‌లో పార్క్ చేశారు. వీటిని అమ్మేందుకు రెండు బుల్లెట్ బైక్‌లపై ముగ్గురు నిందితులు మంగళవారం కాచిగూడ ఎక్స్‌రోడ్ మీదుగా కింగ్ కోఠికి వెళ్తుండగా అక్కడే తనిఖీలు చేస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని ఆపారు. వారి కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని రెండు బుల్లెట్ బైక్‌ల నెంబర్లను పరిశీలించి దొంగిలించిన వాహనాలుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రా నుంచి బస్సులో వచ్చి దొంగిలించిన వాహనాలను కింగ్‌కోఠిలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలింది. దీంతో ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బుల్లెట్ బైక్‌లే...

ఖరీదైన బుల్లెట్ వాహనాలే టార్గెట్‌గా వారు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. లాక్ చేసి ఉన్న బుల్లెట్ వాహనాన్ని దొంగిలించి నేరుగా ఎంజీబీఎస్‌లోని పార్కింగ్ ప్రాంతంలో పెట్టి ఒక్కొక్కటిగా అమ్మాలనేది నిందితుల ఉద్దేశమని అధికారులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తుతో పాటు అతని బృందాన్ని డీసీపీ రావుల గిరిధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ కె ముత్తు ఉన్నారు.